# సాక్షి హైదరాబాద్

గురువారం । 12 । డిసెంబర్ । 2024






**కండల కోసం ఆశపడితే ఖతం!**
కండలు పెంచడానికి కొందరు యువకులు మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లను వినియోగించి ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు.
-12లో



**వింటర్ చిల్స్..**
వింటర్ అంటేనే వెచ్చని పార్టీల సీజన్. చల్లని వాతావరణంలో పుట్టే లేజీనెస్‌ను వేడి వేడి క్రేజీ పార్టీస్ ద్వారా తరిమికొట్టడం యూత్‌కు అలవాటే.
- సిటీప్లస్‌లో

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం
29.0/18.0
నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.




# ప్రజారోగ్యంపై పొగ!

**సాక్షి, సిటీబ్యూరో:** గ్రేటర్‌లో వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో పాటు నైట్రోజన్ డయాక్సైడ్ వంటి హాని కారకాలు నగర వాతావరణంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వాహన కాలుష్యాన్ని అంచనా వేసేందుకు, అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కాలుష్య తనిఖీ స్టేషన్‌ల నిర్వహణ అలంకారప్రాయంగా మారింది. గ్రేటర్‌లోని మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్‌లను రవాణా శాఖ ప్రధాన కార్యాలయంతో అనుసంధానం చేసి.. వాహనాల నుంచి వెలువడే కాలుష్య కారకాలను పారదర్శకంగా అంచనా వేసేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకొని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు ఈ సాంకేతిక వ్యవస్థ పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. దీంతో కాలుష్య నియంత్రణ పరీక్షలు ప్రహసనంగా మారాయి. దీంతో ప్రమాదకర కాలుష్య కారకాలు విషం చిమ్ముతూనే ఉన్నాయి. అయినా.. ఆ వాహనాలు కాలుష్య నియంత్రణ పరిధిలోనే ఉన్నట్లు సర్టిఫికెట్‌లు వచ్చేస్తూనే ఉన్నాయి. నకిలీ మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్‌లే ఇందుకు ప్రధాన కారణం. ఆటో మొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా కాలుష్య తనిఖీలు నిర్వహించకపోవడం గమనార్హం.



**కొరవడిన ప్రామాణికత.. శాస్త్రీయత..**

- ప్రస్తుతం నగరంలో సుమారు 350 వరకు మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ కేంద్రాలు, పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటి ద్వారా నిర్వహించే తనిఖీల్లో మాత్రం ఎలాంటి ప్రామాణికత, శాస్త్రీయత లేదు. వాహనాల నుంచి వెలువడే పొగలోని కాలుష్య కారక పదార్థాలను అంచనా వేసి సర్టిఫికెట్లను అందజేసే కాలుష్య తనిఖీ కేంద్రాలు ఉత్తుత్తి పరీక్షలతో కాసులు పండించుకుంటున్నాయి. దీంతో ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా పరిణమించిన వాహన కాలుష్యాన్ని నియంత్రించాలనే ఉన్నత లక్ష్యం పక్కదారి పడుతోంది. రోడ్డుపై అక్కడక్కడా దర్శనమిచ్చే మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లు వాహనదారులను నిలిపి పరీక్షలు నిర్వహిస్తాయి.
- కాలుష్య నియంత్రణలో ఆ వాహనం ఎలాంటి ప్రమాణాలను అనుసరించేదీ ధ్రువీకరిస్తారు. ఈ టెస్టింగ్ స్టేషన్లు అందజేసే ధ్రువీకరణ పత్రాలనే రవాణా శాఖ ప్రాతిపదికగా భావిస్తోంది. ఇలాంటి కీలకమైన అంశంలో టెస్టింగ్ స్టేషన్లలో సింహభాగం ఎలాంటి పరీక్షలు లేకుండానే వాహనదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నాయి. అతి ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్, హైడ్రో కార్బన్ వంటి పదార్థాలను వెలువరించే వాహనాలకు సైతం ఈ స్టేషన్లు పచ్చజెండా ఊపుతున్నాయి. ప్రస్తుతం నైట్రోజన్ డయాక్సైడ్ వంటి కారకాలు సైతం బాగా పెరిగినట్లు పర్యావరణ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గచ్చిబౌలి, హైటెక్‌సిటీ వంటి కొత్త ప్రాంతాల్లో కాలుష్య కారకాలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి.

**నిబంధనల ఉల్లంఘన..**

- నగరంలో కాలుష్య తనిఖీ కేంద్రాలకు తొలుత 1988లో రవాణా శాఖ అనుమతినిచ్చింది. ఆ తర్వాత 2002లో ఈ స్టేషన్లను కంప్యూటరీకరించారు. కానీ.. వాహనాల్లోంచి వెలువడే పొగలో ఏ రకమైన కాలుష్య కారకాలు ఏ స్థాయిలో ఉన్నాయో శాస్త్రీయంగా నిర్ధారించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటికీ వినియోగంలో లేదు. ఖైరతాబాద్, బండ్లగూడ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో అప్పట్లో మోడల్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. కానీ.. వాటి విస్తరణ నత్తనడకన సాగుతోంది. కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు కొత్తగా స్క్రాప్ సెంటర్‌లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కానీ.. స్క్రాపింగ్ విధానాన్ని వాహనదారుల ఇష్టానికే వదిలి వేయడంతో కాలుష్య నియంత్రణను అరికట్టడంలో ఉదాసీనత చోటుచేసుకొంటోంది.

# సీఆర్ఎంపీ లేనట్టే..!




## మరో ఆరు నెలల వరకు.. బల్దియా ఆధ్వర్యంలోనే రోడ్ల నిర్వహణ

**సాక్షి, సిటీబ్యూరో:** సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం (సీఆర్ఎంపీ) కింద గత అయిదేళ్లుగా నగరంలోని ప్రధాన రహదారుల నిర్వహణ బాధ్యతలు చూసిన కాంట్రాక్టు ఏజెన్సీల గడువు ముగిసిపోతోంది. కానీ.. ఈ బాధ్యతలను తిరిగి ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చే యోచనలో జీహెచ్ఎంసీకి లేదు. కనీసం ఆరుల నెలల నుంచి ఏడాది వరకు జీహెచ్ఎంసీయే నిర్వహించాక తిరిగి ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఏజెన్సీల ఒప్పంద గడువు ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ముగిసిపోయి మిగతా ప్రాంతాల్లోనూ జనవరిలో ముగిసిపోనున్నప్పటికీ, ఇప్పటి వరకు రోడ్ల నిర్వహణ కోసం కొత్తగా టెండర్లు ఆహ్వానించలేదు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏజెన్సీలకు పొడిగింపూ ఇవ్వలేదు.

**రీ కార్పెటింగ్ అవసరం లేదు**

- అయిదేళ్ల క్రితం ప్రధాన రహదారుల మార్గాల్లోని 811 కిలో మీటర్ల మేర నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. ఒప్పందం మేరకు తొలి ఏడాది 50 శాతం, రెండో సంవత్సరం 30 శాతం, మూడో సంవత్సరం మిగతా 20 శాతం రోడ్లను రీ కార్పెటింగ్ చేయడంతో పాటు మరో రెండేళ్ల వరకు నిర్వహణ బాధ్యతలు చూడాలి. అంటే వర్షాలొచ్చి గుంతలు పడ్డా, ఎక్కడైనా దెబ్బతిన్నా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలి. వాటితో పాటు ఫుట్‌పాత్‌ల నిర్మాణం, స్వీపింగ్ మెషీన్లతో రోడ్లు ఊడ్చటం తదితర పనులు చేయాలి.
- ఒప్పంద గడువు ముగిసినా, ఇప్పటికిప్పుడు రోడ్లను రీకార్పెటింగ్ చేయాల్సిన అవసరం లేదని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నారు. అందుకే ఒప్పంద గడువు ముగుస్తున్న ప్రాంతాల్లో పనుల కోసం స్వీపింగ్ మెషిన్లు అద్దెకు తీసుకునేందుకు టెండర్లు పిలుస్తున్నారు. రోడ్ల నిర్వహణను జీహెచ్ఎంసీ ఇంజినీర్లే పర్యవేక్షించనున్నారు. స్వీపింగ్ మెషిన్లతో పనుల కోసం కనీసం ఆరు నెలల సమయమైనా లేనిదే కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకొచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆరు నెలల కాలానికి అద్దె స్వీపింగ్ మెషీన్లకు టెండర్లు పిలుస్తున్నారు. ఈలోగా రోడ్ల నిర్వహణ మొత్తం పనులకు టెండర్లు పిలిచేందుకు అవసరమైన నిధులు సమకూర్చుకోవచ్చున్నది అధికారుల ఆలోచన కావచ్చు.
- ఇప్పటికే సీఆర్ఎంపీ కింద ఉన్న రోడ్లతోపాటు కొత్తవి కూడా అందులో చేర్చి అన్నింటి నిర్వహణ పనులకు అవసరమైన నిధుల్ని ఆర్థిక సంస్థల ద్వారా సమీకరించి, టెండర్లు పిలిచే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అది ఆరు నెలల తర్వాతా.. లేక ఏడాదికా? అన్నది వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈలోగా పాత ఏజెన్సీలు చేయకుండా మిగిలిపోయిన పనులుంటే వాటిని పూర్తిచేయించనున్నారు. లేదా కేవలం చేసిన పనుల వరకే బిల్లులు చెల్లించనున్నారు.

**తక్షణ మరమ్మతులకు టెండర్లు**

మరోవైపు వర్షాలొచ్చినప్పుడు పాట్‌హోల్స్ పడ్డా, ఇతరత్రా కారణాల వల్ల రోడ్లు దెబ్బతిన్నా వెంటనే వాటిని పూడ్చివేయడం, ప్యాచ్‌వర్క్స్ వంటి పనుల్ని కూడా ప్రైవేటు ఏజెన్సీల కిచ్చే ఆలోచనలో జీహెచ్ఎంసీ అధికారులున్నట్లు తెలుస్తోంది.

# రాష్ట్రపతి విడిదికి ఏర్పాట్లు చేయండి

## అధికారులకు మేడ్చల్ కలెక్టర్ ఆదేశాలు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గౌతమ్

**సాక్షి, సిటీబ్యూరో:** భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శీతాకాల విడిది నేపథ్యంలో హైదరాబాద్ రానున్న దృష్ట్యా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 17 నుంచి 21 వరకు ద్రౌపదీ ముర్ము బస చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారుతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రపతి శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 17న హకీంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి, అక్కడి నుంచి బొల్లారం చేరుకుంటారని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 21 వరకు రాష్ట్రపతి నిలయంలో ఉంటారన్నారు. రాష్ట్రపతి రాకను పురస్కరించుకుని సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, మల్కాజిగిరి, కీసర ఆర్డీఓలు శ్యాం ప్రకాష్, సైదులు, ఏసీపీ రాములు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో మానవీయ సమాజం

## 19 నుంచి 29 వరకు హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

- ఎన్టీఆర్ స్టేడియం వేదికగా సుమారు 350 స్టాళ్లు
- 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' అధ్యక్షుడు యాకూబ్




సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్

**కాచిగూడ:** జ్ఞాన తెలంగాణ సాధన కోసం చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కోరారు. సమాజంపై సోషల్ మీడియా ప్రభావం పెరిగినప్పటికీ పుస్తక పఠనం ఏమాత్రం తగ్గలేదన్నారు. మానవీయమైన సమాజాన్ని నిర్మించడం కోసం పిల్లల్లో పుస్తక పఠనాశక్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పుస్తక పఠనంతోనే జ్ఞాన సమాజం ఏర్పడుతుందన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సౌజన్యంతో ఈ నెల 19 నుంచి 29 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుక్ ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్య, సభా కార్యక్రమాల వేదికకు బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికకు తోపుడుబండి సాదిక్ పేర్లు పెట్టినట్లు తెలిపారు. మొత్తం 350 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య రమా మెల్కొటే సలహాదారులుగా ఉంటారని వారు పేర్కొన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. తెలంగాణ వంటకాలతో ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పిల్లల కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పి.నారాయణరెడ్డి, ఆర్.శ్రీకాంత్, కె.బాల్‌రెడ్డి, బి.శోభన్‌బాబు, టి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# భారత్ గౌరవ్ అయోధ్య- కాశీ యాత్ర రైలు ప్రారంభం



**సాక్షి, సిటీబ్యూరో:** భారత్‌గౌరవ్ 'అయోధ్య – కాశీ పుణ్య క్షేత్ర యాత్ర' 26వ టూరిస్ట్ రైలు బుధవారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రారంభమైంది. యాత్రకు బయలుదేరిన ప్రయాణికుల్లోని డాక్టర్ టి. విఠల్‌రెడ్డి, టి.కుసుమలు ఈ రైలును ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్య – కాశీ పుణ్య క్షేత్ర యాత్రలో భాగంగా యాత్రికులు గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లలోని దివ్య క్షేత్రాలను సందర్శించనున్నారు. ఈ నెల 20 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

**త్వరలో మహా కుంభ పుణ్యక్షేత్ర యాత్ర..**

ఐఆర్‌సీటీసీ మహాకుంభ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట త్వరలో మరో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును అందుబాటులోకి తేనుంది. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism.comను సందర్శించవచ్చు, లేదా 040-27702407, 9701360701లను సంప్రదించవచ్చు.

# కుంగదీసిన కేన్సర్

## మానసిక వేదనతో దంపతుల ఆత్మహత్య



జగదీశ్వరి, సూర్యనారాయణ శాస్త్రి (ఫైల్)

**ఉప్పల్:** భార్యకు కేన్సర్ అని తేలడంతో భర్త తల్లడిల్లిపోయాడు. అనారోగ్యంతో భార్య రోజురోజుకూ కుంగిపోతోంది. ఈ పరిస్థితుల్లో మానసిక వ్యథకు గురైన దంపతులు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్ డివిజన్ ధర్మపురి కాలనీకి చెందిన దుర్వాసుల సూర్యనారాయణ శాస్త్రి (60), జగదీశ్వరి (56) భార్యాభర్తలు. సూర్యనారాయణ ఎన్టీపీసీలో జీఎంగా పని చేసి మూడేళ్ల క్రితం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. వీరి కుమారుడు సుశాంత్ గచ్చిబౌలిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల జగదీశ్వరి కేన్సర్ వ్యాధికి గురయ్యారు. దీంతో భార్యాభర్తలిద్దరూ తీవ్రంగా కలత చెందారు. ఈ క్రమంలో ఈ నెల 3న సూర్యనారాయణ శాస్త్రి తన కుమారుడికి ఫోన్ చేసి తాను ఓ సెమినార్ కోసం బయటకు వెళ్తున్నానని, అమ్మను కూడా తీసుకెళ్తున్నాను.. నాలుగు రోజుల వరకు రాను అని చెప్పారు. ఆ తర్వాత వారం రోజులుగా ఎలాంటి ఫోన్ రాకపోవడంతో బుధవారం కుమారుడు తండ్రికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. సెమినార్‌కూ వెళ్లలేదని తెలిసింది. దీంతో హుటాహుటిన బుధవారం ఉదయం ఉప్పల్‌లోని ఇంటికి వచ్చి చూడగా గేట్‌కు తాళం వేసి ఉంది. పని మనిషికి ఫోన్ చేసి పిలిపించి తాళం తీసి వెళ్లగా ఇంటి తలుపులు లోపలి నుంచి లాక్ చేసి ఉన్నాయి. కిటికీలోంచి చూడగా దుర్వాసన రావడంతో వెంటనే తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. అప్పటికే కుళ్లిన స్థితిలో మృతదేహాలు పడి ఉన్నాయి. మృతదేహాల పక్కన, ఇంకా రెండు చోట్ల మూడు సూసైడ్ నోట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'అనారోగ్య కారణాల చేత సూసైడ్ చేసుకుంటున్నాం. మా చావులకు ఎవరూ కారణం కాదు' అంటూ రెండు లైన్లు తెలుగులో నోట్ రాసి ఉంది. దీంతో కుమారుడు సుశాంత్ ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాల్ని స్వాధీనం చేసుకున్నారు. సుశాంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. వారం రోజుల క్రితమే సూర్యనారాయణ శాస్త్రి, జగదీశ్వరి దంపతులు గుర్తు తెలియని మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

# పెట్రోల్ ట్యాంకర్‌లోంచి ఎగసిపడిన మంటలు

**సకాలంలో ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది**

- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరిపీల్చుకున్న పోలీసులు, స్థానికులు

**నాంపల్లి:** అన్‌లోడ్ చేసేందుకు వచ్చిన ఓ పెట్రోల్ ట్యాంకర్‌లోంచి మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరువలో ఏక్ మినార్ మసీదుకు ఎదురుగా ఉండే పెట్రోఫినా ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏక్ మినార్ మసీదు ఎదురుగా ఓ పెట్రోల్ బంకు ఉంది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సంస్థకు చెందిన ట్యాంకర్ పెట్రోల్‌తో అక్కడికి చేరుకుంది. పెట్రోల్‌ను అన్‌లోడ్ చేసేందుకు బంకు వద్ద ట్యాంకర్‌ను పార్కింగ్ చేశారు. హెచ్‌పీసీఎల్ ట్యాంకర్‌లో 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పెట్రోల్‌ను అన్‌లోడ్ చేసేందుకు సిబ్బంది ట్యాంకర్ పైభాగంలోని రెండు మూతలను తెరిచారు. మూడో మూతను తెరిచే క్రమంలో ట్యాంకర్ ఒక్కసారిగా నుంచి మంటలు చెలరేగాయి. ఉవ్వెత్తున ఎగసిపడే మంటలను చూసిన సిబ్బంది, స్థానికులు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే ట్యాంకర్ లోపలి భాగంలో ఉన్న పెట్రోల్‌కు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ యుగంధర్ ప్రసాద్, నాంపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌లు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.




**చాకచక్యంగా మంటలను ఆర్పడంతో..**

అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంతో మంటలను వెంటనే అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. లేదంటే ట్యాంకర్‌లోని పెట్రోల్ పూర్తిగా అంటుకుని పక్కనే ఉన్న పెట్రోల్ బంకుకు మంటలు వ్యాపించేవి. ఫలితంగా మంటలు అర్పడానికి చాలా సమయం పట్టేంది. దీనితోడు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లేది.

**అంతు చిక్కని రహస్యం..**

ట్యాంకర్ నుంచి మంటలు ఎలా వ్యాపించాయనేది పోలీసులకు అంతు చిక్కడం లేదు. మంటలు వ్యాపించడానికి కారణాలను తెలుసునేందుకు ట్యాంకర్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాంపల్లి శాంతిభద్రతల ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపారు.

# మ్యాన్‌హోళ్లకు యూనిక్ ఐడీ నంబర్లు



## డేటాబేస్‌ను జీఐఎస్‌తో అనుసంధానిస్తాం

- 70 రోజుల్లో 1,602 కి.మీ మేర సీవరేజ్ పైపులైన్ క్లీనింగ్
- 1.22 లక్షల మ్యాన్‌హోళ్లలో డీసిల్టింగ్ పనులు పూర్తి
- వచ్చే ఏప్రిల్ నాటికి సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు
- సత్ఫలితాలిస్తున్న సీవరేజ్ స్పెషల్ డ్రైవ్
- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టీకరణ

**సాక్షి, సిటీబ్యూరో:** సీవరేజ్ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్ లక్ష్యంలో భాగంగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (ప్రత్యేక గుర్తింపు సంఖ్య) ఇచ్చి దాని డేటాబేస్‌ను జీఐఎస్‌తో అనుసంధానించే ప్రకియ చేపట్టినట్లు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం ఖైరతాబాద్‌లో జలమండలి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యాన్ హోళ్ల ఓవర్‌ఫ్లోతో పాటు మరమ్మతులు, మూత మార్పిడి తదితర వివరాలు మొత్తం డేటాబేస్‌లో పొందుపర్చుతున్నట్లు తెలిపారు. మ్యాన్‌హోళ్లపై పర్యవేక్షణతోనే ముందస్తు ఓవర్ ఫ్లో కట్టడికి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇప్పటి వరకు 70 రోజుల్లో 12,673 ప్రాంతాల్లో 1,602 కిలోమీటర్ల మేర సీవరేజ్ పైపులైన్ క్లినింగ్‌తో పాటు 1.22 లక్షల మ్యాన్‌హోళ్లలో పూడికతీత పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. సీవరేజ్‌పై రోజూ వచ్చే ఫిర్యాదుల్ని 33 శాతానికి తగ్గించినట్లు అశోక్ రెడ్డి తెలిపారు. మొత్తం కోర్‌సిటీలో 3,600 కిలో మీటర్ల సీవరేజ్ పైపులైన్, 3 లక్షల మ్యాన్‌హోళ్లు ఉన్నాయని, వీటిలో సగానికి పైగా డీసిల్టింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు.

**రోజూవారీ పర్యవేక్షణకు డ్యాష్ బోర్డు**

స్పెషల్ డ్రైవ్ పనుల్ని రోజూవారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్ బోర్డు ఏర్పాటు చేశామని అశోక్ రెడ్డి అన్నారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు.

**ఏప్రిల్ నాటికి పనులు పూర్తి చేస్తాం..**

స్పెషల్ డ్రైవ్‌లో కొన్ని చోట్ల నూతన పైపులైన్ నిర్మాణం అవసరాన్ని గుర్తించామని, వాటిని వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పనులన్నీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు జలమండలి ఎండీ తెలిపారు. స్పెషల్ డ్రైవ్ ముగిసిన అనంతరం.. వచ్చే వానాకాలం నాటికి సీవరేజ్ సమస్యలు గణనీయంగా తగ్గేలా, సీవరేజ్ ఓవర్ ఫ్లో సాఫీగా సాగేలా తదుపరి చర్యలు చేపడతామన్నారు.

**రిజర్వాయర్లు, ఎస్టీపీల పర్యవేక్షణ..**

డ్యాష్‌బోర్డుల ద్వారా రిజర్వాయర్లను నిత్యం పర్యవేక్షించేందుకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అశోక్ వెల్లడించారు. దీని వల్ల రిజర్వాయర్లలో నీటి లభ్యత, ఎంత సరఫరా అవుతుందనే విషయం ఎప్పటికప్పుడు తెలుస్తుందన్నారు. అలా గే మురుగు నీటి శుద్ధి కేంద్రాల పర్యవేక్షణ సైతం అమలు చేస్తామన్నారు. సమావేశంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్స్-2 అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

## పరువునష్టం కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు

**సిటీ కోర్టులు:** బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరుకాగా ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు హాజరుకాగా రేవంత్ రెడ్డి తరుపు న్యాయవాది క్రాస్ఎగ్జామినేషన్ చేశారు. పిటిషనర్‌తోపాటు సాక్షి క్రాంతికుమార్ హాజరు అయ్యారు. అనంతరం తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18కి వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రకాశం స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహిరంగా సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని అసత్యపు ఆరోపణలు చేశారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు కన్నుమూత


జస్టిస్ పర్వతరావు (ఫైల్)

**బంజారాహిల్స్:** హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్.పర్వతరావు (89) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. జూబ్లీహిల్స్ రోడ్‌నంబర్‌- 71లో నివాసముంటున్న జస్టిస్ పర్వతరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు న్యాయమూర్తిగా ఏడేళ్ల పాటు సేవలందించారు. విజయవాడలో జన్మించిన ఆయన.. మద్రాస్ లయోలా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో న్యాయవాద విద్యను అభ్యసించారు. హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన కొన్నాళ్లపాటు రాష్ట్ర వినియోగదారుల సంస్థ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్, ప్రజ్ఞాభారతి, భారతీయ ఆదివక్త పరిషత్ తదితర సంస్థల ద్వారా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చెల్లా కోదండరామ్.. పర్వతరావుకు అల్లుడు అవుతారు. గతంలో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు పలు అవగాహన సదస్సులను జస్టిస్ పర్వతరావు ఆధ్వర్యంలో చేపట్టారు. పర్వతరావు మృతి పట్ల పలువురు విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

## స్కిల్డ్ యూత్...డిమాండ్ ఫుల్



**సాక్షి, సిటీబ్యూరో:** మన నగరాల్లోని యువతలో శరవేగంగా నైపుణ్యాభివృద్ధి జరుగుతోందని, రానున్న ఐదేళ్లలో పలు దేశాల పారిశ్రామిక అవసరాలను అది తీర్చనుందని వీబాక్స్ ఈటీఎస్ ఇండియా స్కిల్స్ రిపోర్ట్ వెల్లడించింది. ఉపాధి, నైపుణ్యం సంబంధిత స్థితిగతులపై పారిశ్రామిక రంగానికి చెందిన సీఐఐ, ఏఐసీటీఇ తదితర సంస్థలతో కలిసి వీబాక్స్ ఈటీఎస్ రూపొందించిన రిపోర్ట్‌ను బుధవారం విడుదల చేశారు. మన శ్రామిక శక్తిలో 65 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన వారు ఉన్నారని, దీంతో గల్ఫ్ దేశాలు, ఆగ్నేయాసియా, యూరప్ ఆఫ్రికాలోని పరిశ్రమల డిమాండ్‌లను తీర్చడానికి వీరు ఉపయోగపడనున్నారని తెలిపింది. ముఖ్యంగా సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, పునరుత్పాదక శక్తి ఏఐ, ఆవిష్కరణలు మన ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపిస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ రిపోర్ట్ విడుదల కార్యక్రమంలో వీబాక్స్ సీఈఓ నిర్మల్ సింగ్ పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాగిల్‌కు ఫాస్ట్ టెక్ ట్రాన్స్‌ఫార్మేషన్ అవార్డు



**సాక్షి, సిటీబ్యూరో:** ప్రముఖ బిటిబి సాస్ ఫిన్‌టెక్ సంస్థ జాగిల్‌కు డెల్లాయిట్ అందించే 'టెక్నాలజీ ఫాస్ట్‌-50 ఇండియా' పురస్కారం లభించింది. దేశవ్యాప్తంగా వేగవంతమైన వృద్ధి కనబరుస్తున్న 50 సంస్థలను ఎంపిక చేసి ఇచ్చే టెక్ ట్రాన్స్‌ఫార్మేషన్ అవార్డుకు నగరం నుంచి జాగిల్ విజేతగా ఎంపిక అయింది. మాదాపూర్‌లోని కంపెనీ ఆవరణలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జాగిల్ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా.రాజ్ నారాయణమ్ ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డెల్లాయిట్ ఇండియాకు చెందిన పీయూష్ వైష్ పాల్గొన్నారు.





# కండల కోసం ఆశపడితే ఖతం!

- మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ల అక్రమ వినియోగం
- గుట్టురట్టు చేసిన సౌత్‌-వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- నలుగురు నిందితుల అరెస్టు, భారీగా సరుకు స్వాధీనం
- ఇలాంటి స్టెరాయిడ్స్ వినియోగం ప్రమాదకరం: డీసీపీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్లు, బైకు

**సాక్షి, సిటీబ్యూరో/విజయనగర్‌కాలనీ:** వైద్య రంగంలో అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లను స్టెరాయిడ్స్‌గా విక్రయిస్తున్నారు. తక్కువ కాలంలోనే ఎక్కువగా కండలు పెంచడానికి కొందరు యువకులు వీటిని బ్లాక్‌లో కొని మరీ వినియోగిస్తున్నారు. జిమ్‌లలో అత్యధిక సమయం గడపటానికి స్టెరాయిడ్‌గా ఈ మందులు తీసుకుంటూ తమ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఉత్తరాది నుంచి మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్న నలుగురు నిందితులను సౌత్‌-వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు డీసీపీ అందె శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వీరి నుంచి 217 ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

**జిమ్ ఏర్పాటుతో ఆర్థిక ఇబ్బందులు**

మహారాష్ట్రకు చెందిన రషీద్ ఖాన్ నగరానికి వలసవచ్చి జిర్రాలోని నట్‌రాజ్ నగర్‌లో నివసిస్తున్నాడు. తొలినాళ్లల్లో జిమ్ ట్రైనర్‌గా, ఆపై పర్సనల్ ట్రైనర్‌గా పని చేసిన రషీద్ మెహదీపట్నంతో సొంతంగా ఆర్‌కే జిమ్ పేరుతో వ్యాయామశాల ఏర్పాటు చేశాడు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో జిమ్ మూసేశాడు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టి తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గాలు అన్వేషించాడు. జిమ్‌లకు వచ్చే యువత ఎక్కువసేపు వ్యాయామం చేయడానికి స్టెరాయిడ్స్‌గా వాడుతున్న మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లకు నగరంలో భారీ డిమాండ్ ఉన్నట్లు గుర్తించారు. వీటిని అక్రమంగా విక్రయిస్తూ 2022లో చంద్రాయణగుట్ట పోలీసులకు చిక్కాడు. అయినప్పటికీ పంథా మార్చుకోని ఇతగాడు అదే విధానం కొనసాగించాడు.

**ఆన్‌లైన్‌లో ఖరీదు చేసి దళారుల ద్వారా...**

కొన్నాళ్లుగా రషీద్ మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు ఇండియా మార్ట్ వెబ్‌సైట్ ద్వారా ఖరీదు చేసి, కొరియర్‌లో నగరానికి రప్పిస్తున్నాడు. వీటిని తన స్నేహితుడైన థెరపిస్ట్ మహ్మద్ అఫ్తాబ్ హుస్సేన్, విద్యార్థి మహ్మద్ హబీబుద్దీన్, టెక్నీషియన్ మహ్మద్ రెహ్మత్ ద్వారా విక్రయిస్తున్నాడు. దళారులుగా పని చేస్తున్న వీరికి కొంత కమీషన్ ఇస్తున్నాడు. జిమ్‌లకు వెళ్తున్న యువత నిర్ణీత బరువు కంటే ఎక్కువ వెయిట్స్ ఎత్తడానికి, ఎక్కువ సమయం వ్యాయామం చేయడానికి ఈ ఇంజెక్షన్లు స్టెరాయిడ్‌గా పని చేస్తున్నాయి. ఈ గ్యాంగ్ ఒక్కో ఇంజెక్షన్ రూ.2000 వరకు అమ్ముతోంది. నిబంధనల ప్రకారం వీటిని కేవలం మెడికల్ షాపుల్లో, వైద్యుడి చీటీ ఆధారంగానే విక్రయించాలి. అయితే వీళ్లు అక్రమంగా సేకరించి తమ జిమ్‌లో అమ్ముతున్నారు.

**భవిష్యత్తులో అనేక దుష్పరిణామాలు...**

ఈ నలుగురూ చేస్తున్న దందాపై సౌత్‌-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.బాలస్వామికి సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఎస్ఐ బి.అజిత్‌సింగ్ తమ బృందంతో దాడి చేసి నలుగురినీ పట్టుకున్నారు. వీరి నుంచి 217 ఇంజెక్షన్లు, వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం కేసును ఆసిఫ్‌నగర్ ఠాణాకు అప్పగించారు. ఇలాంటి ఇంజెక్షన్లు, టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్‌గా వాడటం వల్ల అనేక దుష్పరిణామాలు ఉంటాయని అదనపు డీసీపీ శ్రీనివాసరావు హెచ్చరిస్తున్నారు. దీన్ని వైద్యుల చీటీ లేనిదే అమ్మడం అక్రమం అని స్పష్టం చేస్తున్నారు. వీటిని సుదీర్ఘకాలం వాడితే రక్తపోటు, గుండె సమస్యలతో పాటు మానసిక ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేస్తున్నారు. వీటి విక్రయంపై ఎలాంటి సమాచారం ఉన్నా తమకు అందించాలని ఆయన కోరారు.

# బిగ్‌బాస్ ఫైనల్‌కు భారీ భద్రత

- 53 కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచన
- గత అనుభవాల దృష్ట్యా అడుగడుగునా నిఘా నేత్రాలు


బిగ్‌బాస్ షో జరుగుతున్న అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాలు

**బంజారాహిల్స్:** ఈ నెల 15వ తేదీన బిగ్ బాస్ సీజన్‌-8 ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఇందుకోసం గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అల్లర్లు, గొడవలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్‌-5లోని అన్నపూర్ణ స్టూడియో ఏడెకరాల్లో బిగ్‌బాస్ సెట్టింగ్ వేయగా..ఫైనల్ కూడా ఇక్కడే జరగనుంది. గత ఏడాది డిసెంబర్ 17వ తేదీన బిగ్‌బాస్ సీజన్‌-7 ఫైనల్ సందర్భంగా తలెత్తిన పరిణామాలు, గొడవలు, బస్సులపై రాళ్లు రువ్వడం తదితర అనుభవాల దృష్ట్యా ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. అన్నపూర్ణ స్టూడియో చుట్టూ 53 సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఇప్పటికే పోలీసులు ఆయా పాయింట్లతో కూడిన జాబితాను అన్నపూర్ణ స్టూడియో, బిగ్‌బాస్ యాజమాన్యానికి అందజేశారు. గత ఏడాది ఫైనల్ సందర్భంగా పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకున్న అభిమానులు ఒక సందర్భంలో బస్సులపై రాళ్లు రువ్వి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడగా అప్పటి బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌తో పాటు బిగ్‌బాస్, అన్నపూర్ణ స్టూడియో యాజమాన్యంపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. దాడికి పాల్పడ్డ వారిని గుర్తించడంలో పోలీసులకు చాలా ఇబ్బందులు తలెత్తాయి. ఇక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో చాలామంది తప్పించుకున్నారు. ఈసారి ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే గుర్తించేందుకు వీలుగా బిగ్‌బాస్ షో జరిగే స్టూడియో చుట్టూ 53 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఎక్కడెక్కడ కెమెరాలు ఏర్పాటుచేయాలో జూబ్లీహిల్స్ పోలీసులు ఆ పాయింట్లను బిగ్‌బాస్ యాజమాన్యానికి అందజేశారు. ఈ నెల 14వ తేదీన ఉదయమే వీటిని అమర్చుకోవాలని సూచించారు. వారంక్రితం యూసుఫ్‌గూడ స్టేడియంలో జరిగిన పుష్ప‌-2 ప్రీ రిలీజ్ ఫంక్షన్ సందర్భంగా నిర్వాహకులు 60 తాత్కాలిక సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఆ రోజు జరిగిన కార్యక్రమంలో భారీగా అభిమానులు రావడంతో 15 మొబైల్ ఫోన్లు, రెండు బంగారు గొలుసులు చోరీకి గురయ్యాయి. చోరులను గుర్తించేందుకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బిగ్‌బాస్ సీజన్‌-8 ఫైనల్ సందర్భంగా కూడా చుట్టూ 53 కెమెరాలను ఏర్పాటు చేస్తే పోలీసులకు ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నారు.

## లారీకి బ్రేకులు ఫెయిల్.. తప్పిన ప్రమాదం



**రాజేంద్రనగర్:** అత్తాపూర్‌లో బుధవారం ఓ లారీకి బ్రేకులు ఫెయిలవగా.. డ్రైవర్ చాకచక్యం కారణంగా పెనుప్రమాదం తప్పింది. పిల్లర్ నంబర్ 142 వద్ద..మంగళగౌరీ షాపింగ్ మాల్ ఎదురుగా రహదారిపై వెళ్తున్న ఓ లారీకి అకస్మాత్తుగా బ్రేకులు పని చేయలేదు. గమనించిన డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించి రహదారి మధ్యలో ఉన్న డివైడర్ బారికేడ్లపైకి లారీని ఎక్కించి నిలిపివేశాడు. రెండు అడుగుల దూరంలోనే బస్టాపు ఉండటంతో అక్కడ నిలుచున్న జనం లారీ వేగంగా రావడాన్ని చూసి ప్రాణభయంతో పరుగులు తీశారు. బారికేడ్లు ఎక్కిన లారీ అక్కడే ఆగిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# వైభవంగా ముత్యాలమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ

- హాజరైన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్



అమ్మవారికి పూజలు చేస్తున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

**రాంగోపాల్‌పేట్:** సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ పునః ప్రతిష్ఠ వేడుక బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని గత అక్టోబర్ 14న దుండగుడు ధ్వంసం చేయడంతో అధికారులు అమ్మవారి పంచ లోహ విగ్రహాన్ని తయారు చేయించడంతో పాటు ఆలయాన్ని పునర్నిర్మించారు. దీంతో బుధవారం పునఃప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, కమిషనర్ శ్రీధర్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సోదరబావం, సామరస్యంతో అందరూ ముందుకు వెళ్లాలి**

మినీ ఇండియాగా పేరున్న హైదరాబాద్ ప్రజలు సోదరబావంతో, సామరస్యంతో కలిసి ముందుకు వెళ్లాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గతంలో ఈ దేవాలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పంచ లోహ విగ్రహాన్ని తయారు చేయించి పునఃప్రతిష్ఠించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

– కొండా సురేఖ



**దేవాలయాలు, మందిరాలపై రాజకీయం తగదు**

ఎక్కడైనా దేవాలయాలు, మందిరాలపై రాజకీయాలు చేయడం తగదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల విశ్వాసాలు కాపాడాలనే తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు.ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ముత్యాలమ్మను చేతులు జోడించి ప్రార్థించానని అన్నారు. స్థానిక శాసనసభ్యుడి విజ్ఞప్తి మేరకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాన్ని అభివృద్ధి చేసి విగ్రహ పునః ప్రతిష్ఠ చేశామన్నారు.

– పొన్నం ప్రభాకర్

## మార్కెట్ అభివృద్ధికి చర్యలు

**గడ్డి అన్నారం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్:** గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌లోని హమాలీలకు న్యాయం జరిగేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌లో బుధవారం పాలకవర్గం 2వ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నదే పాలకవర్గం ఉద్దేశమని అన్నారు. అందరి సహకారంతో మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. మార్కెట్ పరిధిలోకి వచ్చే రైతు బజార్లు, ఎన్టీఆర్‌నగర్ మార్కెట్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి సమస్యలు గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నో ఏళ్లుగా మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు గుర్తింపు కార్డులు, లైసెన్స్ సదుపాయాలు లేవని, వారి సమస్యలను దృష్టిలో పెట్టుకుని 65 మంది హమాలీలకు గుర్తింపు కార్డులతో పాటు లైసెన్స్‌లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కరా చారి, డైరెక్టర్లు అంజయ్య, రఘుపతి రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, గణేశ్ నాయక్, లక్ష్మి, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, నరసింహ, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 21 ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలకు ఓయూ నోటీసులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పరిధిలోని ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న హిందీ మహా విద్యాలయం గుర్తింపును రద్దు చేసిన ఓయూ అధికారులు.. ప్రైవేట్ కాలేజీలపైనా చర్యలకు ఉపక్రమించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఓయూకు అనుబంధంగా కొనసాగుతున్న 21 ఎంబీఏ, ఎంసీఏ ప్రైవేట్ కాలేజీలపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టారు. ఆయా కళాశాలల్లో విద్యార్థులు తరగతులకు గైర్హాజరైనా యాజమాన్యాలు పరీక్షలు రాయిస్తున్నాయని, వాటిలో టీచింగ్ ఫ్యాకల్టీ కూడా లేరని, తప్పుడు సమాచారంతో కాలేజీల ఓయూ గుర్తింపులు పొందుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ నెల 13 వరకు సంజాయిషీ ఇవ్వాలని ఓయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆయా కాలేజీల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.

**నోటీసులు అందుకున్న వాటిలో..**

కింగ్‌స్టన్, ఓమెగా, ప్రియదర్శిని, పీవీ రామిరెడ్డి, సిద్ధార్థ, అరిస్టాటిల్, సిద్ధార్థ డిగ్రీ కాలేజీ, సాన్వీ పీజీ కాలేజీ, సుప్రభాత్, సెయింట్ జివెరీస్, విజన్, విజయ, వివేకానంద, సెయింట్ విన్సెంట్, రియా స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, నోబెల్ పీజీ కాలేజీ, మ్యాన్‌పవర్ డెవలప్‌మెంట్ కాలేజీ, కేపీఆర్ ఐటీ ఇంజినీరింగ్ కాలేజీ, అక్షర మేనేజ్‌మెంట్ స్టడీస్, బ్రైట్ మేనేజ్‌మెంట్ కాలేజీ, మదర్ థెరిసా పీజీ కాలేజీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## నాంపల్లి కోర్టుకు హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

**సిటీ కోర్టులు:** గత అసెంబ్లీ ఎన్నికల్లో కమలాపూర్ పోలీసులు నమోదు చేసిన కేసులో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. గత విచారణలో రూ.15 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ప్రజాప్రతినిధుల కోర్టు ఆదేశాలు జారీ చేయగా..బుధవారం ఆయన తరపు న్యాయవాది జక్కుల లక్ష్మణ్ రెండు పూచీకత్తులను కోర్టులో సమర్పించారు. తదుపరి విచారణను జనవరి 8కి కోర్టు వాయిదా వేసింది. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కమలాపూర్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సభలో కౌశిక్‌రెడ్డి ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మాట్లాడినట్లు ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు కమలాపూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు ఆయన హాజరై రెండు పూచీకత్తులు సమర్పించారు.

## బండి సంజయ్ గైర్హాజరు

**సిటీ కోర్టులు:** కేంద్రమంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసు విచారణకు ఆయన గైర్హాజరు అయ్యారు. 2022 అక్టోబర్‌లో మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులను దండుపాళ్యం బ్యాచ్‌గా..దోపిడీ దొంగలుగా అభివర్ణించారని మంత్రి బండి సంజయ్‌పై పరువునష్టం కేసు నమోదవగా.. ప్రజాప్రతినిధుల కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ విచారణకు బండి సంజయ్ గైర్హాజరు కావడంతో కోర్టు జనవరికి వాయిదా వేసింది.

## న్యూసెన్స్ కేసులో పది రోజుల జైలు

**నాంపల్లి:** న్యూసెన్స్ కేసులో ఇరువురికి నాంపల్లి రెండవ స్పెషల్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు పది రోజుల జైలు శిక్షను విధిస్తూ తీర్పును ఇచ్చింది. హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సుభాన్ పురాకు చెందిన రౌడీషీటర్ అమీర్ సోదరుడు అర్బాజ్, అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ నబీ కుమారుడు మహ్మద్ మసూద్ యూసుఫియన్ దర్గా ప్రాంతంలో మద్యం తాగి ఘర్షణ పడ్డారు. వీరిని పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తీసుకెళితే అక్కడా హంగామా సృష్టించారు. ఈ ఘటనలో ఇరువురిపై హబీబ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రెండవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ మేరకు నాంపల్లి కోర్టు న్యూసెన్స్‌కు పాల్పడిన ఇద్దరికి పది రోజుల పాటు శిక్షను విధిస్తూ తీర్పును ఇచ్చినట్లు హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన షురూ

**సాక్షి, సిటీబ్యూరో:** ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైంది. ఈమేరకు ప్రజాపాలనలో గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ)లోని 150 వార్డుల నుంచి 10,40,537 మంది, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్‌లోని 8 వార్డుల నుంచి 29,909.. మొత్తంగా 10,70,446 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ఆయా దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు సర్వేయర్లు, మానిటరింగ్, సూపర్‌వైజింగ్ ఆఫీసర్లను జీహెచ్ఎంసీ నియమించింది. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు ప్రతి వార్డుకు ఇద్దరు లేదా ముగ్గురి చొప్పున 150 వార్డులకు సర్వేయర్లను నియమించారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 5,00,822 దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా సంగారెడ్డిలో 20,711 అప్లికేషన్లు వచ్చాయి. మేడ్చల్‌-మల్కాజ్‌గిరిలో 3,22,064, రంగారెడ్డిలో 1,96,940, కంటోన్మెంట్‌లో 29,909 దరఖాస్తులు వచ్చాయి.